క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్ సేవలు



వరికుంటపాడు: మండలంలోని తూర్పుకొండా రెడ్డిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను శుక్రవారం అందజేశారు. వరికుంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆయేషా 50 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగులు క్రమం తప్పకుండా వైద్యచికిత్సలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం రేష్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఖాసీంబీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా ఇంటర్ విద్య



సోమశిల: ప్రభుత్వం ఉచితంగా ఇంటర్ విద్యను అందిస్తోందని అనంతసాగరం ఎంఈఓ–2 ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఇనుగలూరు, వెంగంపల్లె, ఆమని చిరువెళ్ల, తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకుని అనంతసాగరం జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పది ప్లస్ ప్రధానోపాధ్యాయిని లక్ష్మీప్రసన్న, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెట్టుకూరు సుబ్బారెడ్డి, డీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారాల ప్రదానం రేపు



నెల్లూరు(వేదాయపాళెం): పదో తరగతిలో ఉత్తమ మార్కులను సాధించిన యాదవ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను నగరంలోని జెట్టి శేషారెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం అందజేయనున్నామని యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను పొగతోటలోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పదో తరగతిలో 475కు పైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేయనున్నామని వివరించారు. అర్హులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాలకు 97058 00794, 95731 05305 నంబర్లను సంప్రదించాలని సూచించారు. యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నేతలు డాక్టర్ మాదాల వెంకటరాజేష్‌యాదవ్, చెవుల రామచంద్రయ్య, పెరుమాళ్ల కొండయ్య, ఒంటేరు హరిబాబు, మధుసూదన్‌రావు, పీలం సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు



నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు మెరుగైన సేవలను అందిస్తున్నామని ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ పేర్కొన్నారు. జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపీఓలతో గాంధీనగర్‌లోని మహిళా ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తల పనితీరు మెరుగుపడేలా కేంద్రాలను సీడీపీఓలు, సెక్టార్ సూపర్‌వైజర్లు తనిఖీ చేయాలని సూచించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించాలన్నారు. ఐసీడీఎస్ కార్యాలయ సీడీపీఓ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆదిశంకరాచార్య స్మరణోత్సవాలు

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న జగద్గురు ఆదిశంకరాచార్య స్మరణోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. కంచికామకోటి పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతి జన్మదినాన్ని పురస్కరించుకొని రుద్రాభిషేకం, అర్చనలను నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు ఓరుగంటి శ్రీరామలాలశర్మ ఉపన్యసించారు. పినాకినీ విద్యాపీఠం తరఫున సభాపోషకులుగా స్వయంపాకుల శ్రీనివాసులు, దూబగుంట ప్రభాకర్‌రావు, శ్రీనివాసరావు తదితరులు వ్యవహరించారు. అనంతరం శ్రీరామలాలశర్మను సత్కరించారు. చక్రాల వారి ట్రస్ట్ నిర్వాహకులు ఆనందకుమార్, నరసింహం, మల్లవరపు లక్ష్మీనరసింహారావు, తుర్లపాటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా బాలచౌడేశ్వరి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఏఎస్‌పేటలో తొగటివీర క్షత్రియుల ఆరాధ్యదైవమైన బాలచౌడేశ్వరి అమ్మవారి గ్రామోత్సవాన్ని శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. స్థానిక అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి నవరంగి మేళాలు, డప్పు వాయిద్యాలు, తొగటివీర క్షత్రియులు కత్తిసాము విన్యాసాల నడుమ గ్రామోత్సవం జరిపారు. ఆలయం నుంచి ప్రధాన వీధుల్లో సాగిన గ్రామోత్సవంలో చేనేత కార్మికులతో పాటు వారి బంధువులు పెద్దఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

–అనుమసముద్రంపేట



బాలచౌడేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం

గెలిచేదెవరో..ఓడేదెవరో..

ఆత్మకూరు: ఆత్మకూరు అసెంబ్లీ ఎన్నికల ఫలితంపై ఎడతెగని ఉత్కంఠ నెలకొంది. సార్వత్రిక ఎన్నికలు ఈ నెల 13న ముగిశాయి. కౌంటింగ్‌కు మరో పది రోజులు మాత్రమే సమయం ఉంది. కౌంటింగ్ సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఆత్మకూరు అసెంబ్లీ స్థానం నుంచి గెలిచేదెవరో..ఓడేదెవరో..అనే చర్చలు సర్వత్రా నడుస్తున్నాయి. ఈ దఫా ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గంలో 83.49 శాతం పోలింగ్ నమోదైంది. చేజర్ల మండలంలో అత్యధికంగా, ఆత్మకూరు పట్టణంలో అత్యల్పంగా పోలింగ్ నమోదైంది. పోలింగ్ పూర్తయినప్పటి నుంచి కౌంటింగ్ కోసం ప్రజలు ఎంతో ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు. ఆత్మకూరులో దశాబ్దకాలంగా జరిగిన పలు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే ప్రభంజనం సృష్టించిన విషయం తెలిసిందే. గత ఐదేళ్లలో రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు గడపగడపకు చేరాయి. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన పేద, మధ్యతరగతి ప్రజలు తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలని, ఆ పార్టీ అభ్యర్థులకే పట్టంకట్టేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ముఖ్యంగా మహిళలు ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి తమ కృతజ్ఞత చాటుకున్నట్లు పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోంది. ప్రజల ఆశల మేరకు ఆత్మకూరు అసెంబ్లీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి మరోసారి విజయం సాధించనున్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మరో పది రోజుల్లో జరగనున్న ఎన్నికల కౌంటింగ్ అటు అభ్యర్థుల్లోనూ, ఇటు ప్రజల్లోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది.

కౌంటింగ్ ప్రక్రియ ఇలా..

కౌంటింగ్ ప్రక్రియలో మొదట పోస్టల్ బ్యాలెట్లను, ఆ తరువాత ఈవీఎంలను లెక్కించనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,15,685 ఓట్లు ఉండగా, 1,79,829 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మరో 2611 నమోదయ్యాయి. మొత్తం 1,82,440 ఓట్లను లెక్కించాల్సి ఉంది. తొలుత మర్రిపాడు మండలం వెంకటాపురం నుంచి లెక్కింపును ప్రారంభించనున్నట్లు సమాచారం. ఆ మండలంలోని 1 నుంచి 43వ ఉన్న పోలింగ్ బూత్‌లలో పోలైన 28,921 ఓట్లను లెక్కించనున్నారు. అనంతరం అనంతసాగరం మండలంలోని 44 నుంచి 89 వరకు ఉన్న బూత్‌లలో పోలైన 29,752 ఓట్లను లెక్కించనున్నారు. ఆ తరువాత ఆత్మకూరు రూరల్, మున్సిపల్ పరిధిలోని 90 నుంచి 153వ వరకు ఉన్న బూత్‌లలో పోలైన 42,894 ఓట్లు లెక్కిస్తారు. అనంతరం అనుమసముద్రంపేట మండలంలోని 154 నుంచి 191 వరకు ఉన్న బూత్‌లలో పోలైన 23,374 ఓట్లు, సంగం మండలంలోని 192 నుంచి 238 వరకు ఉన్న బూత్‌లలో పోలైన 30,210 ఓట్లు, చేజర్ల మండలంలోని 239 నుంచి 278 వరకు ఉన్న పోలింగ్ బూత్‌లలో పోలైన 24,672 ఓట్లను వరుసగా లెక్కించనున్నట్లు సమాచారం. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే కౌంటింగ్ ప్రక్రియలో మొదటి రెండు గంటల్లోనే ఎవరు ముందంజలో ఉన్నారనే విషయం తేలనుంది.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు

అల్లూరు: వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ శశిరేఖ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మరమ్మతులకు గురైన చేతిబోర్లు, మంచినీటి పథకాలను వెంటనే పునరుద్ధరించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపైన ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం అధికారులు శాఖలవారీగా ప్రగతిని వివరించారు. ఎంపీడీఓ జ్యోతి, జెడ్పీటీసీ వేణమ్మ, వైస్ఎంపీపీ వాసు, ఈఓపీఆర్డీ వీరేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శశిరేఖ

నాడు–నేడు పనులను త్వరగా పూర్తి చేయాలి

ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు–నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ డీ ఈశ్వరమ్మ, ఎంఈఓ తోట శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో మనబడి నాడు–నేడుకు ఎంపికైన 25 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా చివరి దశలో ఉన్న పనులను పూర్తి చేసేలా హెచ్‌ఎంలు, కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చివరి దశ పనులకు నిధుల కొరత ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే మిగులు నిధులు ఉన్న పాఠశాలల నుంచి కేటాయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఈ శ్రావణ్‌కుమార్, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ

మాతినవారిపాళెంలో వైద్యశిబిరం

కావలి: మండలంలోని సర్వాయపాళెం పంచాయతీ పరిధిలోని మాతినవారిపాళెంలో అతిసారం ప్రబలడంతో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు అతిసారం బారినపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చొరవతో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు వైద్యసిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం సూచనలు, సలహాలు అందజేశారు. తాగునీటిని ల్యాబ్‌కు పంపి పరీక్షించారు. తాగునీటి వల్ల అతిసారం ప్రబల లేదని తెలియజేశారు. కాగా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పలువుర్ని ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, డీపీఓ, డీఎల్‌పీఓ తదితరులు పాల్గొన్నారు.



పది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ఆత్మకూరు: పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఆదివారం నగదు ప్రోత్సాహకాలను అందజేయనున్నట్లు పట్టణానికి చెందిన శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆత్మకూరు మండల స్థాయిలో 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 570 మార్కులపైన సాధించిన వారిలో టాపర్లుగా నిలిచిన ముగ్గురికి నగదు ప్రోత్సాహకాలను అందజేయనున్నట్లు చెప్పారు. అలాగే 500 నుంచి 575 మార్కుల మధ్యన టాపర్లుగా నిలిచిన మరో ముగ్గురికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ఆత్మకూరురూరల్: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మాలకొండయ్య అన్నారు. మండలంలోని మహిమలూరు పరిసర గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులకు పీఎండీఎస్ కిట్‌ల తయారీ, విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన దశలోనే తగ్గిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పంటల దిగుబడిలో లాభాలను పొందవచ్చని తెలిపారు. నూనె గింజలు, వరి, పత్తి, తదితర పంటలను ప్రకృతి వ్యవసాయం విధానంలో సాగుచేసే క్రమంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట ప్రకృతి వ్యవసాయం ఏడీపీఎం మునిరత్నం, ఆర్‌బీకే వీఏఏ నవాబ్, ఎంటీ వరలక్ష్మి, ఎల్–2 సుబ్బరాయుడు, మెంటార్ సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.



విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డీపీఎం మాలకొండయ్య.

శృతిమించిన మందుబాబుల ఆగడాలు

కావలి: పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో మందుబాబుల ఆగడాలు రోజుకురోజుకు శృతిమించుతున్నాయి. ఈ ప్రాంతంలో రెండు బార్లు ఉన్నాయి. ఇక్కడ నిబంధనలను అతిక్రమించి 24 గంటలూ మద్యం అమ్మకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. దీంతో మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారు. ఉదయాన్నే వీధులను శుభ్రపరిచే మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండడంతో ఆ ప్రాంతంలో విధులు నిర్వహించేందుకు వారు హడిలిపోతున్నారు. పట్టణ ప్రజలతో పాటు రైల్వే ప్రయాణికుల రాకపోకలతో రైల్వేస్టేషన్ సెంటర్ నిత్యం రద్దీగా ఉంటోంది. నిత్యం మందుబాబులు దురుసుగా ప్రవర్తిస్తుండడం, గొడవలకు సైతం దిగుతుండడంతో పట్టణ ప్రజలతో పాటు రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బార్‌లలో నిబంధనలను అతిక్రమించి మద్యం అమ్మకాలు సాగిస్తున్నా సెబ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. బార్ల నిర్వాహకులు అందజేసే మామూళ్లు పుచ్చుకుని కన్నెత్తి చూడకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు మండిపడుతున్నారు.

రేపు డాక్టర్ రమణారెడ్డి వర్ధంతి సభ

ఆత్మకూరు: వామపక్ష భావజాలంతో జిల్లాలోని పేదలకు ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రజావైద్యశాలలను ఏర్పాటు చేసిన డాక్టర్ చెర్లో రమణారెడ్డి వర్ధంతి సభను ఆదివారం నిర్వహించనున్నట్లు పట్టణ సీపీఎం కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సాయంత్రం 5 గంటలకు నిర్వహించే వర్ధంతి సభకు సీపీఎం నాయకులు చంద్రా రాజగోపాల్, కామ్రేడ్ మోహన్‌రావు, తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. పట్టణ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఉపాధి పనుల తనిఖీ



ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లెలో చేపడుతున్న ఉపాధి పనులను ఏపీఓ బీ శ్రీనివాసరావు శుక్రవారం తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించి క్షేత్రసహాయకులు, మేట్లకు సూచనలు చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం 6 నుంచి 11 గంటల వరకు పనులు చేపట్టాలని సూచించారు. కూలీలు ఎక్కువ శాతం మంది పనులకు వచ్చేలా చూడాలన్నారు. కూలీలు కేటాయించిన కొలతల ప్రకారం పనులు చేపట్టి ప్రభుత్వం కల్పించిన గిట్టుబాటు కూలి రూ.300 పొందేలా చూడాలన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 321

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.321 పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 668 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 540 బేళ్లను కొనుగోలు చేశారు. 128 బేళ్లను వివిధ కారణాలతో కొనుగోలుకు తిరస్కరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.321, కనిష్టంగా రూ. 205, సరాసరిన రూ.273.34 ధర పలికినట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ చెప్పారు. వేలంలో 15 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

27న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఆత్మకూరురూరల్: ఈ నెల 27న మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశంలో ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యంపై చర్చించనున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్



ఉదయగిరి: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలని ఈఓపీఆర్డీ ఎస్ మల్లికార్జున పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని శకునాలపల్లె, కృష్ణంపల్లె పంచాయతీల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో శుక్రవారం చేపట్టిన క్లోరినేషన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు వారి పరిధిలోని ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టి ఫొటోలను విధిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు.

మేకపాటితో వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం

కలిగిరి: దుత్తలూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిగిరి జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రి రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి శుక్రవారం సమావేశమయ్యారు. మండలంలోని పంచాయతీల వారీగా జరిగిన పోలింగ్ వివరాలు, మెజార్టీల అంచనాలపై చర్చించారు. ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కుడుమలదిన్నెపాడు పీఏసీఎస్ చైర్మన్ ములకా శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ దేవిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి



నేత్రపర్వంగా సీతారాముల కల్యాణోత్సవం



సీతారామపురంలో సీతారాముల కల్యాణోత్సవం

సీతారామపురం: మండలంలోని ఓగూరువాండ్లపల్లిలో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. అనంతరం సీతారాముల ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంలో కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. శనివారం పార్వేట, ఆదివారం పొంగళ్లు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా సీతారాముల ఉత్సవాలు ప్రారంభం

ఉదయగిరి: మండలంలోని ఆర్లపడియలో సీతారాముల ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు లోకా వెంకటప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆలయశుద్ధి, గణపతిపూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, మూలవిరాట్టు, ఉత్సవ విగ్రహాలకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం పుట్టమన్ను తెచ్చి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. రాత్రి సీతారాముల గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం సీతారాముల కల్యాణ మహోత్సవం, ఆదివారం వసంతోత్సవం, పార్వేట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఉదయగిరిలో అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తలుపూరుపాడులో కార్డన్‌సెర్చ్

సంగం: మండలంలోని తలుపూరుపాడులో పోలీసులు శుక్రవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సంగం ఎస్సై నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేపట్టారు. వాహనాల పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పోలీసు యాక్ట్ 30 అమల్లో ఉన్నందున ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదన్నారు. ఎవరైనా బాణసంచా కాల్చిన, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కౌంటింగ్ రోజు ఘర్షణలకు దిగితే చర్యలు



గ్రామస్తులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ వెంకటరమణ

కావలి: ఓట్ల లెక్కింపు రోజున ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తప్పవని కావలి డీఎస్పీ ఎం వెంకటరమణ హెచ్చరించారు. మండలంలోని తుమ్మలపెంటలో శాంతిభద్రతలపై గ్రామస్తులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల రోజు గ్రామంలో గొడవలు జరగడంతో ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ఇప్పటికే పలువురిపై ఎలక్షన్ ఘర్షణలకు సంబంధించి కేసులు నమోదు చేసి ఉన్నామన్నారు. గ్రామానికి కట్టుబాట్లు ఉన్నా అవి కోర్టుల పరిధిలోకి రావన్నారు. మరోసారి ఘర్షణలకు దిగి కేసులు నమోదైతే జీవితాంతం కోర్టుల చుట్టూ తిరగాల్సి ఉంటుందన్నారు. పోలీసుయాక్ట్ 30 అమల్లో ఉన్నందున కౌంటింగ్ రోజు ర్యాలీలు, సభలకు అనుమతి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శీనానాయక్, కావలి రూరల్ సీఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.